కుల గణనలో విశ్వకర్మల ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరం

కాచిగూడ, నవంబర్ 24 : విశ్వబ్రాహ్మణ అనేది అనాదిగా వస్తున్న సామాజిక వర్గమని, ఆ వర్గాన్ని గుర్తించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలంగాణ విశ్వబ్రాహ్మణ(మనుమయ)సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు పడకంటి అంజయ్యాచారి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో విశ్వకర్మల ప్రస్తావన లేకపోవడం శోచనీయమని దీంతో విశ్వకర్మలను విస్మరించినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ పేరిట కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుందని, కంసాలి, వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి వృత్తుల వారు విశ్వబ్రాహ్మణు, విశ్వకర్మలుగా గుర్తింపు పొందారని ఆయన గుర్తుజేశారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి బదులుగా ఆయా వృత్తులనే కులాలుగా పేర్కొన్నదని, వృత్తులు వేరే అయినప్పటికీ వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారేనని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల కుల అస్తిత్వమే దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, నవంబర్ 24: రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం సికింద్రాబాద్-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి లింగంపల్లి నుంచి తిరుపతికి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సుమారు 50-55 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై గులాబీ రంగు తెల్లని గీతల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. మృతుడి ఎడమ చేతికి ఆరు వేళ్లు ఉన్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధికులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పేరుకుపోయిన చెత్త.. స్థానికుల ఇబ్బందులు

గోల్నాక కల్లు కంపౌండ్‌ను ఆనుకొని ఉన్న రోడ్డుపైన పేరుకుపోయిన చెత్తాచెదారం

అంబర్‌పేట, నవంబర్ 24: నల్లకుంట డివిజన్ గోల్నాక కల్లు కంపౌండ్ వద్ద రోడ్డుపై చెత్త పేరుకు పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అటునుంచి వెళ్లే వారు ఆ వాసన భరించలేక ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. దీనికి తోడు పక్కనే కల్లు కంపౌండ్ ఉండడంతో మద్యం మత్తులో బయటకు వచ్చిన తాగుబోతులు అక్కడే నిలబడి మూత్ర విసర్జన చేస్తుండటంతో ఆ దారిన వెళ్తున్న మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రాకపోకలకు కూడా ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏరోజు కారోజు చెత్తను తొలగించాల్సి ఉన్నా పారిశుధ్య కార్మికులు అటువైపు కనెత్తి చూసిన పాపాన పోవడం లేదని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే చెత్త సేకరణ సరిగా జరుగడం లేదని స్థానికులు తెలిపారు. దీనివల్ల నిత్యం స్థానికులు నరకాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య విభాగం అధికారులు, సూపర్‌వైజర్లు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యా, వైద్య రంగాలలో.. సేవలు భేష్

అబిడ్స్, నవంబర్ 24 : విద్యా, వైద్యం సామాజిక రంగాలలో పేదలకు సహాయం చేస్తూ ఆదర్శంగా లాడ్జ్ డెక్కన్ నంబర్ 20 సభ్యుల కృషి అభినందనీయమని సంస్థ దక్షిణ భారత ప్రాంతీయ గ్రాండ్ మాస్టర్ డీఎన్ మనోహరన్ అన్నారు. గోషామహల్‌లోని కార్యాలయంలో శనివారం రాత్రి వరకు జరిగిన సంస్థ వార్షికోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. గత ఏడాది సంస్థ ఆధ్వర్యంలో 13.94 లక్షల విలువతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. అదే విధంగా నిలోఫర్ ఆసుపత్రికి రూ.3,90,000 విలువైన బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్ విరాళం ఇచ్చినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలకు విరాళంగా రూ.1,68,000 విలువ చేసే కుర్చీలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేయడం, నిరుపేద ఇంజినీరింగ్ విద్యార్థికి స్కాలర్‌షిప్ విరాళం అందించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి లక్ష రూపాయల విరాళం, నిలోఫర్ ఆసుపత్రికి ఇంక్యుబేటర్లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఆల పురుషోత్తంరావు, ఐపీఎం రమేశ్, ఏఆర్‌జీఎం ఎం. రమేశ్, బ్రదర్ సవన్‌కుమార్, ఎల్.హనుమంతరావు, సత్య భూషణ్ ఖన్నా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

రవీంద్రభారతి, నవంబర్ 24: విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తే మేధస్సుతో పాటు చదువుల్లో బాగా రాణించగలుగుతారని స్లేట్ స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి అమర్‌నాథ్, ప్రిన్సిపాల్ సీమాజైన్ అన్నారు. ఆదివారం స్లేట్ స్కూల్ (హిమాయత్‌నగర్) 7వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్లేట్ స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి అమర్‌నాథ్, ప్రిన్సిపాల్ సీమా జైన్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చిన్నారి విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక నృత్యకార్యక్రమాలను ప్రారంభించారు. డైరెక్టర్ వాసిరెడ్డి అమర్‌నాథ్, ప్రిన్సిపాల్ సీమాజైన్ మాట్లాడుతూ.. బాల బాలికలకు చిన్ననాటి నుంచి చదువుతో పాటు దేశభక్తి గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, క్రీడలు, యోగా వంటి కార్యక్రమాలను నేర్పిస్తే మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొంది ఉన్నత చదువల్లో రాణించగల్గుతారని పేర్కొన్నారు. సభకు ముందు బాల బాలికలు పలు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి వీక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు.ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, అధ్యాపకులు స్లేట్ స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

నేటి నుంచి అయ్యప్పస్వాములకు ఉచితాన్నదానం

ఉస్మాన్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రాధాకృష్ణ

అబిడ్స్, నవంబర్ 24 : భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఉస్మాన్‌గంజ్‌లోని సమితి కార్యాలయంలో సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు 41 రోజుల పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేశ్, కోశాధికారి సీఏ అనిల్ నాయర్ అన్నారు. ఆదివారం ఉస్మాన్‌గంజ్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బాస్ ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎగ్జిబిషన్ మైదానంలో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తామని రాధాకృష్ణ తెలిపారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవ సమితి ప్రతినిధులు కాటేపల్లి రాజు, నార్ల జగదీశ్, నర్సింగ్‌రావు, విజేందర్‌రెడ్డి, వై. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతి సేవా మండలి దసరా, దీపావళి సమ్మేళనం

చుడీబజార్‌లోని అరుంధతి సేవావ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

అబిడ్స్, నవంబర్ 24 : అరుంధతి సేవా మండలి ఆధ్వర్యంలో దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనాన్ని చుడీబజార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జియాగూడ నవభారత సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ, అడ్వైజర్ వై. యాదయ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అరుంధతి సేవా మండలి అధ్యక్షుడు ఎం. కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. ధర్మేందర్, కోశాధికారి ఎం మహేశ్‌బాబు, ఎం. గోపాల్, డి. వెంకటేశ్, ఎం. చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రదర్శనలోనే యువన ధర్మశీలన్ ప్రతిభ

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 24 : అక్షద స్కూల్ ఆఫ్ ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు నిహంత్రి రెడ్డి నృత్య పర్యవేక్షణలో కూచిపూడి నాట్యాన్ని అవపోసిన పట్టిన యువన ధర్మశీలన్ తొలి ప్రదర్శన ఆదివారం సాయంత్రం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో నయనానంద కరంగా సాగింది. బాల్యం నుంచే కళాత్మక అంశాల పట్ల ఆసక్తి కలిగిన యువన ధర్మశీలన్ తన తొలి ప్రదర్శనతో నృత్య ప్రియులను అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువు పద్మ శ్రీ డాక్టర్ జి. పద్మజారెడ్డి, సాహితీ వేత్తలే ఆర్ ఆరుల్ ప్రకాశం, రాజేశ్ పగడాల, జీవీ సుబ్బారావు పాల్గొని యువన ధర్మశీలన్ ప్రతిభను ప్రశంసించారు.

ఘనంగా మహాపడి పూజ

అయ్యప్పపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్‌యాదవ్

చిక్కడపల్లి, నవంబర్ 24: బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి: మోండా డివిజన్ సెకండ్ బజార్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై పూజలు చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి హకీంపేట్‌లో రూ. 8.50 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి అధికారులు కృషి చేయాలని అన్నారు.

– మెహిదీపట్నం, నవంబర్ 24

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఒవైసీకి వివరించారు.

– మెహిదీపట్నం, నవంబర్ 24

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాచిగూడ, నవంబర్ 24: మందుబాబులపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి లింగంపల్లి ఎక్స్‌రోడ్, బర్కత్‌పుర పెంట్రోల్ పంప్ సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రాత్రి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 25 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాహనదారులు తాగుడుకు బానిసై తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని, కుటుంబ సభ్యులను దృష్టిలోపెట్టుకొని వాహనాలను నడపాలని సూచించారు.

నిజాం కళాశాలలో ఘనంగా జాతీయ ఎన్‌సీసీ డే వేడుకలు

ఎన్‌సీసీ డే వేడుకలలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 24: నేషనల్ క్యాడెట్ కోర్(ఎన్‌సీసీ),ఎన్ఎస్ఎస్‌ల వల్ల విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఐఖ్యతాభావం పెంపొందుతుందని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం నిజాం కళాశాలలో జాతీయ ఎన్‌సీసీ డే వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సవధర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్‌లు పరేడ్‌తో పాటు పలు విన్యాసాలను ప్రదర్శించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి జాతీయ సమైఖ్యత,సేవాభావంతో పాటు దేశ సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ కెప్టెన్ టి. గంగాధర్, ఎన్‌సీసీ కళాశాల ఆఫీసర్ నవీన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, అడాక్టర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రేణుకతో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాద్రి రైల్లో దొంగతనం

కాచిగూడ, నవంబర్ 24: వెంకటాద్రి రైల్లో ప్రయాణికుని ల్యాప్‌ట్యాప్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓలేటి వంశీకృష్ణ వెంకటాద్రి రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వస్తుండగా ఉందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగు చూసుకునేసరికి ల్యాప్‌ట్యాప్ కన్పించలేదు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 24: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ మినీ ఓయూకాలనీ, 11 కేవీ వెస్టర్న్ ప్లాజా, 11 కేవీ ఓయూ కాలనీ ఫీడర్ల ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

మిని ఓయూ కాలనీ ప్రాంతం, గ్యాస్ గోడౌన్ , వెస్టర్న్ ప్లాజా, కట్టెల బస్తీ, ముస్లిం బస్తీ, ద్వారకా నగర్, ఓయూ కాలనీ ప్రాంతం, బిలాల్ మసీద్ ప్రాంతాలు.

2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు...

సక్కు బాయి కాలనీ, షేక్‌పేట్, ఓయూ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఏఎంఆర్ పట్ల అప్రమత్తత పెరగాలి

అమీర్‌పేట్, నవంబర్ 24: యాంటీ బయోటిక్స్ వల్ల తలెత్తే యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అనేక ఇన్ఫెక్షన్లకు దారి తీస్తాయని, అందుకే ఏఎంఆర్ పట్ల ప్రతి ఒకరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ ఆర్నీబిలోరియా పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ అవగాహన వారోత్సవాన్ని పురస్కరించుకుని అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్‌లో ఈనెల 18 నుంచి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ప్రపంచంలో 10 అతి పెద్ద ఆరోగ్య ముప్పుల్లో ఒకటిగా ఏఎంఆర్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందని అన్నారు. 1990 నుంచి ప్రతిఏటా దాదాపు 10లక్షల మంది ఏఎంఆర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. 2050 నాటికి 4 కోట్ల మంది ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదముందని గ్లోబల్ రీసెర్చ్ ఆన్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ పరిశోధనలో తేలిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా యాంటీ బయాటిక్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

మాదిగలకు ప్రభుత్వం అన్యాయం

బన్సీలాల్‌పేట్ సమావేశంలో పాల్గొన్న మాదిగ హక్కుల పోరాట సంఘం నాయకులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 24: మాదిగలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు కె.లక్ష్మీపతి అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో మాదిగ హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న వర్గీకరణను కావాలని జాప్యం చేస్తున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాలను చేపట్టి మాదిగలకు అన్యాయం చేస్తున్నా, అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో మాదిగల సత్తా చూపించి, ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆయన అన్నారు. సమావేశంలో కన్వీనర్ కుర్మ బలరాం, నాయకులు ఏసూరి శ్రీనివాస్, గోవర్ధన్, శివ, లక్ష్మీనారాయణ, మహేశ్, శంకర్, మధు, రాజు, చిన్నా, సత్తి, దేవి, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సత్కరిస్తున్న చర్చి కమిటీ సభ్యులు

ముషీరాబాద్, నవంబర్ 24: తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేదుకు తగిన చర్యలు తీకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. రాంనగర్ వెస్లీ చర్చి వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించినందుకు ఆదివారం చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుటున్నామని అన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, శంకర్ ముదిరాజ్, వెంకటేశ్, శ్రీధర్‌రెడ్డి, చర్చి కమిటీ ప్రతినిధులు థామ్సన్, జయరావు, సామ్యూల్, ఎస్ఐ సిమన్, సునీల్, మాణిక్‌రావు, దివాకర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోళ్లు

- అవస్థలు పడుతున్న వాహనదారులు
- దినదిన గండంగా మారిన అంతర్గత రోడ్లు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

వారాసిగూడలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

సికింద్రాబాద్, నవంబర్ 24: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో మ్యాన్ హోళ్లు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్థానికులు ఈవిషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. నెల రోజుల నుంచి పరిస్థితి అలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక చేసేది ఏమీ లేక స్థానికులే మ్యాన్ హోల్‌లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. వాటి వల్ల ప్రమాదాలు జరుగకుండా పూల కుండీలను, కట్టెలను అడ్డుగా పెడుతున్నారు. అయినా స్థానికులకు ప్రమాదాలు తప్పట్లేదు. సీతాఫల్‌మండి రామాలయం వద్ద మ్యాన్ హోల్ పైకప్పు ప్రమాదకరంగా మారింది. దీంతో గత బుధవారం గ్యాస్ ఎజెన్సీకి చెందిన వ్యాన్ సిలిండర్లు ఇంటింటికీ డెలివరీ చేసేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుంది. వ్యాన్ డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. అటు వైపు వెళ్తున్న వాహనదారులు, నామాలగుండు వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యుడు బేతాళ నరేశ్ ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇక రాత్రిపూట మ్యాన్ హోల్ గుంతలు కనిపించక పోవడంతో వాహనదారులు ప్రమాదాల పడుతున్నారు. వారాసిగూడ సెయింట్ జాన్స్ స్కూల్ ముందు రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్ పైమూత అందులో పడి ప్రమాదకరంగా మారింది. స్కూల్ ముందు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఆమ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేపట్టినట్టు స్కూల్ ప్రన్సిపాల్ అంకం శ్రీకాంత్ తెలిపారు. అటు వైపు ఎవ్వరు వెళ్లకుండా పూల మొక్క కుండీని అడ్డుగా పెట్టారు. వారాసిగూడలో మసీదుకు వెళ్లే దారిలో మ్యాన్ హోల్ ప్రమాదకంగా మారింది. దీంతో స్థానికులు పొడువు కట్టెను అడ్డుగా పెట్టారు. అయినా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మ్యాన్ హోళ్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.